క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



వెంకటాచలం: మండలంలోని తిక్కవరప్పాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప నాయుడు స్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ గురువారం వైభవంగా జరిగింది. తొలుత శతాధిక ప్రతిష్ఠాపనాచార్యులు బ్రహ్మశ్రీ గాడేపల్లి ప్రశాంత్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప నాయుడు స్వామి, మహాగణపతి, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. వారికి అన్నదానం చేశారు.

పక్కాగా ఇంటింటి సర్వే



మాట్లాడుతున్న తహసీల్దార్

మనుబోలు: పంచాయతీ ఎన్నికల కోసం ఇంటింటి సర్వేను బీఎల్వోలు పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ సుబ్బయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితాను పరిశీలించి తప్పులను సరి చేయాలని సూచించారు. అర్హత ఉండి ఓటు హక్కు లేని వారిని గుర్తించి వారిని ఓటరుగా నమోదు చేయించాలన్నారు. ఇప్పటి నుంచి అక్టోబర్ 18 వరకు సర్వే చేయాలని ఆదేశించారు. సర్వే అనంతరం ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, నిబంధనల మేరకు జాబితాను రూపొందిచాలన్నారు. డీటీ శివప్రసాద్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో కోడూరు పశువైద్యశాల



పశువైద్యశాల

తోటపల్లిగూడూరు: మేజర్ పంచాయితీ కోడూరులో పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకుంది. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనం కూలేందుకు సిద్ధంగా ఉంది. కోడూరుతోపాటు వెంకన్నపాళెం, విలుకానుపల్లి గ్రామాల్లో పాడి రైతులకు ఇది ఎంతో కీలకం. అయితే భవనం పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరుకోవడంతో ఇక్కడికి రావాలంటేనే పాడి రైతులు జంకుతున్నారు. చిరుజల్లులకే ఉరుస్తుండడంతో వైద్యశాలలోని మందులు, పరికరాలు దెబ్బతింటున్నాయి. ఇందులో విధులు నిర్వహించలేక వైద్యులు, సిబ్బంది తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. భారీ వర్షాలు, గాలివాన సమయంలో భవనం కూలిపోతుందోనని భయపడి తాళాలు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఉన్నతాధికారులు స్పందించి కొత్త భవనం నిర్మించాలనీ పాడి రైతులు కోరుతున్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం



నెల్లూరు సిటీ: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి రూ.మూడు వేల సాయాన్ని పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ ఆధ్వర్యంలో గురువారం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకుడు కోగిలి రమేష్‌రాజు, సభ్యులు సాయిరెడ్డి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాలలో గెస్ట్ ఉపాధ్యాయులుగా పని చేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ పుష్పరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, గణితం పోస్టులు ఖాళీ ఉన్నాయని చెప్పారు. 2018 డీఎస్సీ నియమ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారు ఈ నెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆధ్యాత్మిక ఉపన్యాసం రేపు

నెల్లూరు(బృందావనం): ఆనందంగా జీవించడంలో ఆధ్యాత్మిక పాత్ర అనే అంశంపై ఉపన్యాసాన్ని నెల్లూరు టౌన్‌హాల్ ప్రాంగణంలో గల వర్ధమాన సమాజ మందిరంలో శనివారం నిర్వహించనున్నామని చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక నిర్వాహకులు యజ్ఞావఝుల శేషగిరీశం, డాక్టర్ సుబ్రహ్మణ్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధ్యాత్మికవేత్త కర్లపూడి కృష్ణ ఉపన్యసించనున్నారని, కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

నిమ్మ పంటకు చీడపీడల బెడద

మెట్ట ప్రాంత రైతుల నుంచి నిమ్మ తోటలను వేరు చేసి చూడలేం. దీని సాగే ఎంతోమందికి ఆధారం. ఈ పంట నేడు కొందరు రైతుల కంట కన్నీరు తెప్పిస్తోంది. దీనికి చీడపీడలే ప్రధాన కారణం. సాగు విషయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నా రైతులు మాత్రం వేరే పంటల జోలికి వెళ్లడం లేదు.

- మెట్ట ప్రాంతంలో ఈ సాగే జీవనాధారం
- తగ్గుతున్న కాయల దిగుబడి
- పెరుగుతున్న యాజమాన్య పద్ధతులు

జిల్లాలో సీజన్‌లో..
(ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు..)

నిమ్మ సాగు : 17 వేల హెక్టార్లు

పొదలకూరు యార్డు నుంచి రోజూ ఎగుమతులు : 20 లారీలు

ప్యాక్ చేసి ఎగుమతి చేస్తున్న కాయలు : 400 టన్నులు



సాగులో ఉన్న నిమ్మ తోట

పొదలకూరు: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సర్వేపల్లి, వెంకటగిరి, ఆత్మకూరు, ఉదయగిరి, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల్లో నిమ్మ తోటల సాగు ఉంది. ఉద్యాన శాఖ అధికారులు సాగులో మెలకువలతోపాటు తరచూ రైతులకు అవగాహనా సదస్సులను నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా పొదలకూరులో ప్రభుత్వం నిమ్మ మార్కెట్ యార్డు ఉన్నందున ఈ ప్రాంతంలో నాలుగు వేల హెక్టార్లలో నిమ్మ సాగులో ఉంది. చీడపీడల బారిన పడుతున్న తోటలను కాపాడుకునేందుకు రైతులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ కారణాలతో..

వేసవి కాలంలో నిమ్మకాయల ధరలు పెరుగుతున్నా యాజమాన్య ఖర్చులు అధికంగా వెచ్చించాల్సి వస్తోందని రైతులు చెబుతున్న మాట. ఈ ప్రాంతంలో ప్రధానంగా ఆకుముడత, గాడిదమచ్చ, గజ్జి, వేరుకుళ్లు, ఎండుపుల్ల, బంక, గవ్వనత్తల తెగుళ్లు ఆశిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పురుగు మందుతోనే రైతులు ఆర్థికంగా సతమతమవుతున్నారు. చాలా మందికి సామూహిక పిచికారీ విధానం తెలియదు. తమ తోటల్లో తెగుళ్లను నివారించినా పక్కతోటల నుంచి తిరిగి ఆశిస్తుండడంతో ఖర్చులు క్రమంగా పెరిగి పెనుభారంగా మారుతున్నాయి. దీనికితోడు పలువురు శాస్త్రీయ పద్ధతిలో ఉద్యానాధికారుల సలహాలు తీసుకోకుండా సొంతంగా పిచికారీ పద్ధతులను అనుసరించడం వల్ల కూడా కొంత నష్టపోతున్నట్లు తెలుస్తోంది.

నివారణ ఇలా..

- గజ్జి తెగుల వల్ల కాయల నాణ్యత తగ్గుముఖం పడుతుంది. దీని ప్రభావంతో కాయల దిగుబడి తగ్గి ఆకులు, పండ్లపై మచ్చలు ఏర్పడతాయి. ఆకులు రాలిపోతాయి. చెట్టు నుంచి జిగురులాంటి ద్రవం కారుతుంది. దీని నివారణకు రైతులు ముందుగా తెగులున్న కొమ్మలను కత్తిరించాలి. తర్వాత ఒక గ్రాము స్ట్రెప్టోసైక్లిన్, 30 గ్రాముల బ్లైటాక్స్ 10 లీటర్ల నీటిలో కలిపి 20 రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడు సార్లు పిచికారీ చేయాలి. తెగులున్న బెరడును కత్తితో తీసి బోర్డ్ పేస్టు పూస్తే మంచి ఫలితం ఉంటుంది.
- బంక తెగులు వల్ల కూడా రైతులు నష్టపోతుంటారు. వర్షాకాలంలో అధికంగా ఇది సోకుతుంది. సోకిన భాగంలో విపరీతంగా బంక కారడం ముఖ్య లక్షణంగా ఉంటుంది. ఫైటోఫ్తరా వల్ల వచ్చే బంక తెగులు మొదట కింద భాగంలో పరిమితం అవుతుండగా డిప్లోడియా వల్ల వచ్చే తెగులు చెట్టు మొదలు పైభాగంలో కొమ్మలకు వస్తుంది. నివారణకు కత్తితో తొలగించి 0.1 శాతం మెర్కురిక్ క్లోరైడ్ లేక ఒక శాతం పొటాషియం పర్మాంగనేట్‌తో తడపాలి. తర్వాత బోర్డ్ పిస్టుతో పూత పూస్తే ఫలితం ఉంటుంది.
- గవ్వనత్తల తెగులు చెట్టు మొదలు, కొమ్మలకు పడితే ఆకుల నుంచి రసం పీల్చి కొమ్మలు ఎండిపోయేందుకు కారణం అవుతాయి. వీటి నివారణకు బోడు మిశ్రం, క్లోరిఫైరిఫాస్ కలిపి పిచికారీ చేయాలి. మొదల్లో ఉంటే ఇదే మిశ్రమాన్ని పేస్టులా పూస్తే ఫలితం ఉంటుంది.



ఆకుముడత తెగులు సోకడంతో..



బెట్టకు వచ్చిన కాయలు

చాలా ఇబ్బందిగా ఉంది



మా తోటల్లో ఇటీవల గవ్వనత్తల తెగుల వల్ల ఇబ్బందిగా ఉంది. చెట్టు మొదట్లో కొమ్మలపై గవ్వలతో ఉన్న నత్తలు చేరి రసం పీల్చేస్తున్నాయి. ఫలితంగా చెట్టు కొమ్మలు ఎండుదశకు చేరుకునేలా ఉన్నాయి. ఉద్యానాధికారి సలహా అడిగి నివారణకు మిశ్రమాన్ని తయారు చేసుకుంటున్నాం.

– ఎ.గంగిరెడ్డి, నిమ్మ రైతు, మొగళ్లూరు

యాజమాన్య పద్ధతులు కష్టంగా ఉన్నాయి



నిమ్మ తోటల చీడపీడల యాజమాన్య పద్ధతులు కష్టంగా మారింది. ఆర్థికంగా రైతులు చితికిపోవడంతోపాటు, దిగుబడి కూడా తగ్గిపోతోంది. సీజన్లో కాయలు దిగుబడి అయితేనే రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతారు. లేదంటే పెట్టుబడులు పెట్టి నష్టపోవాల్సి వస్తోంది.

– పెంచల నారాయణరెడ్డి, నిమ్మ రైతు, అంకుపల్లి

సాగు పెరుగుతూనే ఉంది



ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా రైతులు నిమ్మ తోటల సాగును వదులుకునేందుకు సిద్ధంగా లేరు. ఫలితంగా ప్రతి ఏడాది తోటల సాగు పెరుగుతూనే ఉంది. ముదురు తోటలను తొలగించే రైతులు వెంటనే మొక్కలను నాటుతున్నారు. ఇందుకోసం ఉద్యాన శాఖ సబ్సిడీలను కూడా అందజేస్తోంది.

– ఈ.ఆనంద్, ఉద్యానాధికారి, పొదలకూరు

పద్మనాభసత్రంలో 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్య బృందం

కొడవలూరు: మండలంలోని పద్మనాభసత్రంలో ఆ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులిచ్చారు. ఈ సందర్భంగా కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి జి.బాలచంద్రబాబు మాట్లాడుతూ ఆస్పత్రికి రాలేని వారికి ఇంటి వద్దే వైద్య సేవలందిస్తామన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎస్ వి.రామ్మోహన్, హెచ్ఏ సుధాకర్, ఏఎన్ఎం దొరసానమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నగర పంచాయతీ కమిషనర్ బదిలీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కమిషనర్‌గా పనిచేస్తున్న వెంకటరమణబాబు బదిలీ అయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసిన చంద్రశేఖర్‌రెడ్డి తిరిగి ఆయన స్థానంలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

వరి పంట పరిశీలన



కొడవలూరు: మండలంలోని బొడ్డువారిపాళెంలో సాగులో ఉన్న వరి పంటను గురువారం ఏఓ సీహెచ్ఎస్.లక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంటను కంకి నల్లి ఆశించి ఉన్నందున నివారించుకోవాలని సూచించారు. కోతకు సమీపిస్తున్న పంటనే కంకి నల్లి ఆశించి ఉన్నందున నివారించుకోకుంటే రైతులు నష్టపోతారన్నారు. ఏఓ వెంట వీఏఏలు కె.స్రావ్య, ఒ.సుజిత్, జి.ఉమామహేష్, రైతులున్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

పొదలకూరు: కలుపు మొక్కల అనర్థాలపై గురువారం పాలిటెక్నిక్ విద్యార్థులకు పొదలకూరు చిరుధాన్య పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, ఎన్జీ రంగా వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ప్రసన్నరాజేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1950వ సంవత్సరం ప్రారంభంలో యూఎస్ఏ నుంచి దిగుమతి చేసుకున్న గోధుమలతో పార్థినీయం మొక్క భారత్‌లోకి ప్రవేశించినట్లు చెప్పారు. ఇది జీవవైవిధ్యం, వ్యవసాయ ఉత్పాదకతపై పెద్ద ఎత్తున ప్రభావం చూపుతుందన్నారు. స్కిన్ అలర్జీలు, శ్వాసకోశ వ్యాధులు, గవద జ్వరాలకు కారణం అవుతుందన్నారు. అనంతరం విద్యార్థులు ఈ మొక్కలను పరిశోధన స్థానం పరిసర ప్రాంతాల నుంచి తొలగించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సురేఖదేవి, ఎస్‌కే హసీనా, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కృష్ణతేజ, అరుణమ్మ

కోవూరు: అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ కృష్ణతేజ అన్నారు. మండలంలోని ఇనమడుగు గ్రామ పంచాయతీని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా 87 రకాల పనులను కల్పించాలన్నారు. అనుమతిన పనులను తప్పనిసరిగా జరపాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డీపీఓ సుస్మితారెడ్డి ఎంపీడీఓ శ్రీహరి, తహసీల్దార్ నిర్మలందబాబు, సర్పంచ్ ప్రమీలమ్మ పాల్గొన్నారు.

పీఆర్ డైరెక్టర్ పరిశీలన

పొదలకూరు: పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ ఎం.కృష్ణతేజ గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని పరిశీలించారు. రాపూరుకు వెళ్తున్న ఆయన దారిలో ఈ కార్యాలయం వద్ద ఆగారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. శాఖపరమైన ప్రశ్నలడిగి సమాధానాలు తెలుసుకున్నారు. ఆయన వెంట డ్వామా పీడీ బి.శ్రీనివాసులు, ఎంపీడీఓ టి.నగేష్‌కుమారి, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ డి.దుర్గాదొరబాబు, పంచాయతీ సెక్రటరీలున్నారు.

నేటి నుంచి గ్రామసభలు

పొదలకూరు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను గుర్తించేందుకు పంచాయతీల వారిగా ఈనెల 23వ తేదీ నుంచి గ్రామ సభలను నిర్వహిస్తామని ఎంపీడీఓ టి.నగేష్ కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సభల నిర్వహణ కోసం నోడల్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. ఉదయం 10 గంటలకు ఒక గ్రామసభను ప్రారంభిస్తామని నోడల్ అధికారి పర్యవేక్షణలో పంచాయతీ సెక్రటరీ సభలను నిర్వహిస్తారన్నారు. ఆయా గ్రామాల్లో ఉపాధి పనులను కోసం వినతిపత్రాలను ఇవ్వాలని సూచించారు.

- మనుబోలు: గ్రామసభలు నిర్వహించి ఉపాధి హామీ పనులను గుర్తిస్తామని ఏపీఎం రాజమ్మ తెలిపారు. గురువారం ఆమె తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని 14 సచివాలయాల పరిధిలో సభలను శుక్రవారం నుంచి నిర్వహిస్తామన్నారు. ఉదయం 11 గంటలకు కొన్ని గ్రామాల్లో, మధ్యాహ్నం 2 గంటలకు మరికొన్నిచోట్ల జరుగుతాయన్నారు. కూలీల అర్హతలు, హక్కులపై అవగాహన కల్పిస్తామని, అలాగే ఇప్పటి వరకూ మంజూరైన పనుల పురోగతిని వివరించడం జరుగుతుందని తెలిపారు. ఉపాధి పథకం ద్వారా 2024 – 25 సంవత్సరానికి సంబంధించి కొత్తగా చేయబోయే పనులకు రైతుల నుంచి ఆమోదం తీసుకుంటామన్నారు.



మాట్లాడుతున్న ఏపీఓ రాజమ్మ

- తోటపల్లిగూడూరు: ఉపాధి హామీ పథకంపై శుక్రవారం గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ ఇన్‌చార్జి కౌసల్యమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి పథకం మేట్లు, సాంకేతిక సిబ్బంది సభలకు తప్పనిసరిగా కావాలన్నారు.
- బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని 13 పంచాయతీల్లో శుక్రవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తామని ఎంపీడీఓ నరసింహారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారని వివరించారు.
- కొడవలూరు: మండలంలోని అన్ని పంచాయతీల్లో శుక్రవారం జరిగే గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి పనులను తెలియజేయడంతోపాటు సామాజిక తనిఖీ తదితర విషయాలు తెలియజేస్తారన్నారు.
- విడవలూరు: స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించే గ్రామసభను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన వివరాలు వెల్లడించారు.

చిరుద్యోగులను తొలగించడం అన్యాయం

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి




వెంకయ్యస్వామిని దర్శించుకున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: కూటమి ప్రభుత్వంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, మహిళా సంఘాల వీఓఏలు, మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీల నిర్వాహకుల వంటి చిరుద్యోగులను తొలగించడం అన్యాయమని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పొదలకూరు సాయిబాబా మందిరంలో గురువారం ఆయన ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం నరసింహకండ్రిక, బిరదవోలు గ్రామాల్లో వివాహాలకు హాజరై కార్యకర్తలు, అభిమానులను కలిశారు. అనంతరం కాకాణి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా పథకాలను అమలు చేయడంతోపాటు చిరుద్యోగుల జోలికి వెళ్లలేదన్నారు. అర్హులైన ఏ ఒక్కరి రేషన్‌కార్డు, పెన్షన్ తొలగించిన దాఖలాలు లేవన్నారు. టీడీపీ నాయకులు రాజకీయకక్షతో అర్హులకు పథకాలు అందకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నట్లు ఖండించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఏ ఒక్క కుటుంబానికి అన్యాయం జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. అధికారులు ఇష్టానుసారం ప్రవర్తించి ప్రజలకు అన్యాయం చేస్తే భారీ మూల్యాం చెల్లించుకోక తప్పదన్నారు. సర్వేపల్లిలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై పోరాటం ఉధృతం చేస్తామన్నారు. కాకాణి వెంట నాయకులు కోనం చినబ్రహ్మయ్య, కె.కోటేశ్వరరావు, నెట్టెం భాస్కర్‌నాయుడు, ఎం.బాలకృష్ణారెడ్డి, వెన్నపూస దయాకర్‌రెడ్డి, కేతు రామిరెడ్డి, సుబ్బానాయుడు, దామోదరావు తదితరులున్నారు.

వెంకయ్యస్వామి ఆశీస్సులు మెండుగా ఉండాలి

వెంకటాచలం: దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆశీస్సులు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర ప్రజలకు మెండుగా ఉండాలని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోరారు. మండలంలోని గొలగమూడి గ్రామంలో ఉన్న వెంకయ్యస్వామి ఆశ్రమానికి గురువారం సాయంత్రం ఆయన విచ్చేయగా ఈఓ పి.బాలసుబ్రహ్మణ్యం ఘన స్వాగతం పలికారు. అనంతరం కాకాణి వెంకయ్యస్వామిని, ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా ఆరాధన మహోత్సవాలను ఈఓ ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, మండలాధ్యక్షుడు కొణిదెన మోహన్‌నాయుడు, నాయకులు ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి, కొణిదెన విజయభాస్కర్ నాయుడు, కట్టంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వెలిబోయిన వెంకటేశ్వర్లు, మంచు వెంకటేశ్వర్లునాయుడు, మంచు శ్రీనివాసులునాయుడు, తుపాకుల కిరణ్‌కుమార్, ముంగర శ్రీనివాసులు, నలగర్ల రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి పొగాకు బ్యారెన్ల రిజిస్ట్రేషన్



రాజశేఖర్

మర్రిపాడు: 2024–25 పంట కాలానికి సంబంధించి పొగాకు బ్యారెన్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 28 నుంచి ప్రారంభమవుతుందని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ గురువారం తెలిపారు. అక్టోబర్ 23 వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా రిజిస్ట్రేషన్లను చేయనున్నట్లు చెప్పారు. ఆ తర్వాత నవంబర్ 7 వరకు రూ.100, నవంబర్ 11వరకు రూ.400 అపరాధ రుసుంతో రిజిస్ట్రేషన్లను రెన్యూవల్ చేయనున్నట్లు తెలిపారు. 2024–25 పంట కాలానికి పొగాకు బోర్డు ఒక బ్యారెన్‌కు దక్షిణ ప్రాంత తేలిక నేలల్లో 3.37 హెక్టార్లలో 4,275 కిలోల పొగాకు పండించేందుకు అనుమతించినట్లు చెప్పారు. గత పంట కాలానికి కన్నా 625 కిలోలు అధికంగా పండించేందుకు అనుమతించినట్లు చెప్పారు. పొగాకు బోర్డు అనుమతించిన పరిమితి మేరకే రైతులు పొగాకును పండించాలని సూచించారు. అధికంగా పొగాకును పండించడం వల్ల డిమాండ్ తగ్గిపోయి సరైన గిట్టుబాటు ధరలు రావన్నారు. ఈ ఏడాది ప్రపంచ దేశాల్లో పొగాకు ఉత్పత్తి పెరిగే అవకాశం ఉందన్నారు. బ్యారెన్లు, పొలాలు అధిక ధరలకు కౌలుకు తీసుకుని సాగుచేయడం వల్ల చాలా నష్టపోయే అవకాశముందని హెచ్చరించారు. అందువల్ల రైతులు పొగాకు పంటను తగ్గించి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు.

నిందితులను శిక్షించాలని డిమాండ్



కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

కోవూరు: కోల్‌కతా ఆర్జీకార్ ఆస్పత్రిలో పీజీ ట్రెయినీ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ.. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కోవూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహిళా సాధికార కమిటీ ఆధ్వర్యంలో గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి కొవ్వొత్తులతో ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ వైద్యులకు ప్రభుత్వమే రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామ్‌ప్రసాద్‌రెడ్డి, మహిళా సాధికార కమిటీ కన్వీనర్ డాక్టర్ కె.లావణ్య, ఎన్ఎస్ఎస్ కన్వీనర్ మధుసూదన్‌రావు, శోభారాణి, సువర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు

- కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): రోడ్లను ఆక్రమించి ట్రాఫిక్ అంతరాయాలకు కారణమయ్యే వారికి భారీ జరిమానాలను విధించడంతో పాటు కఠిన చర్యలు చేపడతామని కమిషనర్ సూర్యతేజ స్పష్టం చేశారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా పాత మున్సిపల్ కార్యాలయం నుంచి సిరి మల్టీప్లెక్స్, ఏసీ సెంటర్ వరకు అధికారులతో కలిసి గురువారం పర్యటించిన ఆయన మాట్లాడారు. వివిధ కూడళ్లలోని ఐల్యాండ్లు, డివైడర్లను పరిశీలించి వాటికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. ఫుట్‌పాత్‌లపై ఎలాంటి సైన్‌బోర్డులను పెట్టొద్దని దుకాణదారులకు సూచించి, వీటిని తొలగించారు. నగరంలోని ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే జరిమానాలను విధించాలని ఆదేశించారు. నగరంలోని అన్ని రోడ్లపై ఉన్న భవన నిర్మాణ సామగ్రిని తొలగించేలా యజమానులకు నోటీసులను జారీ చేయాలని సూచించారు. ఏసీ సెంటర్ కూడలిలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌కు అవసరమైన మరమ్మతులు ఇతర వసతులను కల్పించేందుకు గానూ నివేదికలను సిద్ధం చేయాలని కోరారు.

పనులు వేగవంతం

అల్లీపురంలోని మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని కమిషనర్ సూర్యతేజ తనిఖీ చేశారు. వివిధ విభాగాల్లో జరుగుతున్న శుద్ధి ప్రక్రియను ఆరాతీశారు. అనంతరం కేంద్రంలో పబ్లిక్ హెల్త్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూగర్భ డ్రైనేజీ పనులను వేగవంతం చేయాలని సూచించారు. అన్ని గృహాల డ్రెయిన్లు, కాలువలను అనుసంధానించి శుద్ధి కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అల్లీపురం, జనార్దన్‌రెడ్డికాలనీ, డ్రైవర్స్ కాలనీలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు నిరంతరం పనిచేసేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం వెంకటేశ్వరపురంలోని నల్లకాలువలో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. పబ్లిక్ హెల్త్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈలు సంజయ్, చంద్రయ్య, ఎల్ అండ్ టీ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.